సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
గురువారం 7 నవంబర్ 2024 పేజీలు 8



## 10న ఉచిత డీఎస్సీ శిక్షణకు

# స్క్రీనింగ్ టెస్ట్

**పరీక్ష నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలి : జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ**

**మచిలీపట్నం, నవంబర్ 6, మేజర్ న్యూస్ :** ఉచిత డీఎస్సీ శిక్షణ పొందుటకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్సీ అభ్యర్థులకు ఈ నెల 10వ తేదీన జరిగే స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ, రవాణ, విద్యుత్, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులతో జిల్లాలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణపై సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మిగతా 2లో

పట్టభద్రుల ఓటర్ల నమోదులో..

## ప్రముఖ పాత్ర పోషిస్తున్న టీడీపీ శ్రేణులు

**అందరూ దరఖాస్తు చేసుకునేలా ఓటర్లను సమయాత్తం చేస్తున్న టీడీపీ శ్రేణులు**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రమంతటా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఈ ప్రక్రియలో పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడం ప్రతి పార్టీ నుంచి నాయకులు కార్యకర్తలు పోటీ పడుతున్నారు. ఎంపీ కేశినేని చిన్ని సూచనల మేరకు పార్టీ శ్రేణులంతా పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడంలో ఎవరికి వారు కష్టపడి పనిచేస్తున్నారు. ఈ ఓటర్ల నమోదు చేయించడంలో అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తూ, మిగతా 2లో...



## కలిసి పని చేయాల్సిన

# బాధ్యత మనది



**పామర్రు నవంబర్ 6 మేజర్ న్యూస్ :** ప్రజల అవసరాలు తీర్చేందుకు పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు అందరం కలసి పనిచేయాల్సిన బాధ్యత మనపై ఉందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన సర్వసభ్య సమావేశంలో మిగతా 2లో...

## నగరంలో నాణ్యమైన మంచినీళ్లు సరఫరా

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

7

పనులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా

## పర్యవేక్షించాలి

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

## అక్రమ కేసులు మోపటంలో..

# ఏపీలో మొదటి స్థానంలో నందిగామ

- 40 శాతం మంది ప్రజల మద్దతు కలిగింది వైసీపీ
- ఎన్ని బెదిరింపులకు పాల్పడిన భయపడే ప్రసక్తే లేదు
- ప్రతిపక్ష పాత్రను కచ్చితంగా పోషిస్తాం
- మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు

**నందిగామ, నవంబర్ 6, మేజర్ న్యూస్ :** అక్రమ కేసులు మోపటంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నందిగామ నిలిచిందని మాజీ శాసనసభ్యుడు డా. మొండితోక జగన్ మోహన రావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మోహన రావు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 40 శాతం మంది ప్రజల మద్దతు కలిగిన పార్టీ అని ఎవరు ఎన్ని బెదిరింపులకు పాల్పడిన భయపడే ప్రసక్తే లేదని మిగతా 2లో...



(మొదటిపేజీ తరువాయి)

### పట్టభద్రుల ఓటర్ల నమోదులో..

## ప్రముఖ పాత్ర పోషిస్తున్న టీడీపీ శ్రేణులు



7వేలకు పైగా ఓట్లర్లను నమోదు చేయించి అందరికి మార్గదర్శిగా నిలబడ్డారు పురుషోత్తం. ఈయన అందరికి తెలియకపోయిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆఫీస్ వెళ్లే వారందరికి సుపరిచితులే.. పార్టీ కోసం, ప్రజల కోసం అహర్నిశలు శ్రమించే ఎంపీ కేశినేని చిన్ని స్ఫూర్తితో ఆయన అడుగు జాడల్లో నడుస్తూ అందరికి సయపడుతూ, అందరి అభిమానం చోరగొన్న వ్యక్తి పురుషోత్తం. బుధవారం పురుషోత్తంకి విజయవాడ పశ్చిమ 54 డివిజన్ టీడీపీ ప్రెసిడెంట్ సయ్యద్ సలీమ్, షేక్ తాజుద్దీన్ ఆధర్యం లో సయ్యద్ కీర్మనీ వారు నమోదు చేయించిన 35 అప్లికేషన్స్ పురుషోత్తంకి అందించడం జరిగింది.

## నారాయణ ఈ - టెక్నో స్కూల్ ఉపాధ్యాయులకు చెక్కు అందజేత




**నందిగామ, నవంబర్ 6, మేజర్ న్యూస్ :** ఎస్ ఎస్ సి 2023 - 2024 విధ్యా సంవత్సరపు పరీక్షా ఫలితాల లో హాజరైన 65 మంది విధ్యార్ధులకు 65 మంది 100 % శాతం ఉత్తీర్ణత సాధించినందుకు, స్కూల్ యావరేజ్ మార్క్ (529) సాధించినందుకు ఎన్టీఆర్ జిల్లా నందిగామ నారాయణ ఈ - టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ కుమారస్వామి, అధ్యాపక బృందానికి నారాయణ విధ్యాసంస్థల డైరెక్టర్. రమ నారాయణ రూ.25,000ల చెక్కును అందజేసి అభినందనలు తెలియజేశారు. ప్రతి విద్యార్ధి యొక్క భవిష్యత్తు అభివృద్ధి తమ లక్ష్యమని పటిష్టమైన ప్రణాళిక, తల్లిదండ్రుల యొక్క సహకారంతో ఇటువంటి విజయాలు సాధ్యమని నారాయణ విధ్యాసంస్థల యన్టీఆర్ జిల్ల ఏ.జి.యం.హరీష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్ధినీ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అసిస్సీ విద్యార్థులు



**పామర్రు నవంబర్ 6 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పామర్రు లోని అసిస్సీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వలసా సబాష్టియన్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్కిప్పింగ్ రోప్ పోటీలలో పాఠశాల విద్యార్థులు ముగ్గురు అండర్ -14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. తమ పాఠశాల విద్యార్థులు ఎన్.ఉదయ్ కిరణ్, జి.ఆదర్శ, జి.మహిత లు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. ఈనెల 8వ తేదీ నుండి భీమవరంలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ ముగ్గురు విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆమె చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ రోజ్ థామస్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం. గ్లాడిసన్ లు ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# 10న ఉచిత డీఎస్సీ శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

(మొదటిపేజీ తరువాయి)



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ అభ్యర్ధులకు రెసిడెన్షియల్ విధానంలో ఉచిత డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్ధుల ఎంపికకు జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాలలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా పరీక్ష కేంద్రాలలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ముం దస్తు ఏర్పాట్లు చేయాలని, జనరేటర్ లు సిద్ధంగా ఉండాలని, కంప్యూటర్ సమ స్యల పరిష్కారానికి సాంకేతిక సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. అదేవిధంగా ఆ రోజున పరీక్షా కేంద్రాలకు అభ్యర్ధులు చేరుకునేందుకు వీలుగా రవాణా సౌక ర్యం కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవా లని రవాణా శాఖ అధికారులకు సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయం, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలతో పాటు పరిసర ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ అధికారులకు కలెక్టర్ సూచించారు.జిల్లాలో గంగూరులోని ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల, అదేవిధంగా కానూరు విఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 10వ తేదీన ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు జరుగుతుందని, ఆ రోజున ఎలాంటి గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు అభ్యర్ధులు పరీక్ష సమయానికి 30 నిమిషాలు ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు షాహిద్ బాబు షేక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ జి గీతాబాయి, మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# కలిసి పని చేయాల్సిన బాధ్యత మనది



(మొదటిపేజీ తరువాయి)

ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు, శాసన సభ్యునిగా తాను కలసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్య ఉన్నా తమ పరిధిలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పరిష్కరించాలని, అవసరమైతే తన దృష్టికి తీసుకువస్తే తాను కూడా సహకారం ఇస్తానని పేర్కొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇప్పటికే పామర్రు మండలానికి దాదాపు 6.50 కోట్ల రూపాయల నిధులతో అన్ని గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణాలను ప్రారంభించామన్నారు. అంతేగాక అదనంగా మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు, సి ఎస్ ఆర్ నిధులతో మరిన్ని పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రానున్న కాలంలో మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. క్రింది స్థాయి ఉద్యోగులు, పార్టీ కార్యకర్తలు పూర్తిస్థాయిలో మంచి పనులు చేసినప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు ఎవరైనా తన పేరు గాని, పార్టీ పేరు గాని ఉపయోగించి దుర్వినియోగం చేస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండల పరిషత్ అధ్యక్షుడు దాసరి అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షను నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు సభ్యులు గ్రామాలలో తాగునీటి సమస్య, విద్యుత్ సమస్యలపై సభ దృష్టికి తీసుకురాగా ఆయా అధికారులు వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమావేశంలో ఎండిఓకే జ్యోతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు లతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# అక్రమ కేసులు మోపటంలో ఏపీలో మొదటి స్థానంలో నందిగామ

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు.కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పని చేసేందుకు కొంత సమయం ఇవ్వాలని సంయమనం పాటించామని ప్రతిపక్ష పాత్రను కచ్చితంగా పోషిస్తామని చెప్పారు. సోషల్ మీడియా కార్యకర్తలపై అధికార పక్షం, ప్రభుత్వ పోలీస్ శాఖ అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బంది పెడుతున్న విషయాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 42 కేసులు నమోదు చేస్తే ఒక్క నందిగామలోనే 9 కేసులు పెట్టి నందిగామను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపారని తెలిపారు.

### అసభ్యకర పోస్టులు పెడితే ఖండించాల్సిందే..

అసభ్యకర పోస్టులు పెడితే ఎంతటి వారిపైనైనా ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందేనని, ప్రతి ఒక్కరూ ఖండించాల్సిందేనని జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకున్నా ఎవరు ఆక్షేపించరన్నారు. అసభ్యకర పోస్టులు పెడితే పోలీస్ స్టేషన్ కు పిలిపించి విచారణ జరిపి చర్యలు తీసుకోవడంలో తప్పేమీ లేదని కానీ ఎటువంటి తప్పుడు పోస్టులు పెట్టక పోయినా గడిచిన మూడు రోజులుగా పోలీస్ స్టేషన్కు పిలవడం ఉదయం నుంచి రాత్రి వరకు కూర్చోబెట్టడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇందుకు సంబంధించి పోలీసుల తీరుపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పారు. తప్పు చేసిన వారిని పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కానీ అధికార పార్టీ నాయకుల వద్దకు పిలిపించి వారి ఆత్మ గౌరవం దెబ్బతినేలా మోకాళ్ళపై కూర్చోబెట్టి అవమానకరంగా వ్యవహరించిన తీరు మనందరికీ తెలుసని గుర్తు చేశారు.. కులం పేరుతో దూషించక పోయినప్పటికీ ఒక ప్రజా ప్రతినిధి తనను కులం పేరుతో దూషించారని తప్పుడు కేసు పెట్టించడంపై మేం సిగ్గు పడుతున్నామని తెలిపారు.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై గౌరవం పోయేలా వ్యవహరిస్తూ కేవలం రాజకీయ కక్ష సాధింపులకు ఆ చట్టాలను వినియోగించడం బాధాకరమని తెలిపారు.ప్రతిపక్షంలో ఉండగా వారు మాట్లాడినప్పుడు భావ ప్రకటన స్వేచ్ఛ అయినప్పుడు ఇప్పుడు కాదా అని ప్రశ్నించారు. శాంతి భద్రతల విషయంలో పోలీసులు, ప్రభుత్వ పని తీరుపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడటం సంతోషకరమని అధికార పక్షంలో ఉన్న ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. బయటకు వెళ్తే ప్రజలు తిడుతున్నారు.. మీరు నిర్లక్ష్యంగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని.. మీరు కాకుండా అదే నేనైతే అని మాట్లాడడం ప్రభుత్వ పని తీరుకు అద్దం పడుతుందన్నారు.. ఐదారు నెలలుగా రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న కక్ష సాధింపు చర్యలపై కూడా దృష్టి పెడితే బాగుండేదని తెలిపారు.వ్యవస్థలను సరిగా పని చేయనీయకపోతే ఎలా ఉంటుందో పోలీస్ శాఖను చూస్తే అర్థమవుతుందని తెలిపారు.. బాధితులు పోలీసుల వద్దకు వెళితే వారు అధికారంలో ఉన్నారు.. మీరు సమయమనం పాటించాలి.. మాపై ఒత్తిడి ఉంది అని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత ఐదేళ్లలో పోలీసులు ఎలా పని చేశారు ఇప్పుడు ఎలా పని చేస్తున్నారో ఒక్కసారి ఆలోచించుకోవాలని ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు.

# దీపాలు వెలిగించి అజ్ఞాన తిమిరాలు, పారదోలండి

## ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కార్తీక మాసంలో ప్రమిదలో ఆవునెయ్యి పోసి దీపాలు వెలిగిస్తే మనలో అజ్ఞాన తిమిరాలు రూపుమాపే విధంగా పరమేశ్వరుని అనుగ్రహం కలుగుతుందని, అంతేకాకుండా దీపదానం చేసేవారికి పుణ్యఫలం లభిస్తుందని ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు పిలుపునిచ్చారు. నేడు నాగ పంచమి పంచమి సందర్భంగా నాగులకు వున్న ప్రాధాన్యత గురించి ఆయన వివరించారు. విష సర్పాలతో పాటు దేవతా సర్పాలు వుంటాయని మహా విష్ణువు పాలకడలిపై "శేష తల్పంపైన శయనిస్తాడని, పరమేశ్వరునికి సర్పం మెడలో ఆభరణంగా వుంటుందని, పరస్పర విరోధులు అయిన నెమలి, పాము సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పాద దాసులుగా వుంటాయని, అదేవిధంగా గరుత్మంతుడు, ఆదిశేషుడు విరోధులైనా వారికి మహావిష్ణు కైవల్యం లభించిందన్నారు. విరోధులను ఒకే చోట చేర్చి వారి సేవలను అందుకుంటున్న మహా విష్ణువు, శివునికి తారతమ్యం లేదన్నారు. శివాయ విష్ణు రూపాయ, విష్ణవే శివాయనమః అను నానుడి ఉంది, అందువల్ల కార్తీక మాసంలో శివుని, విష్ణువును ఆరాధించాలన్నారు. మల్లన్నకు ఘనంగా రుద్రాభిషేకం నాగ హారతి సమర్పించిన ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు హైదరాబాదు నగరంలోని నిజాంపేట్ శ్రీ భ్రమరాంబా సమేత శ్రీ మల్లికార్జున స్వామికి బుధవారం ఉదయం 5 గం.నుండి రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్, హైదరాబాదు ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు మల్లన్నకు " నాగ హారతి" సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక స్వామి శ్రీధరమల్లె గౌతమ్ కుమార్ శర్మ, పాల్వంచ రిటైర్డ్ పోలీస్ సూపరింటెండెంట్ గూడూరి సత్యనారాయణ మూర్తి, ప్రముఖులు వాకాడి రామ్ కుమార్, కూనిశెట్టి నంద కిషోర్, రాయపాటి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## రాజశేఖర్ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కార్తీక మాసం పర్వదినాలను పురస్కరించుకుని స్థానిక రాజరాజేశ్వరి సమేత రాజశేఖర్ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. బుధవారం నాగపంచమి సందర్భంగా స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షణలో 18 జంటల తో సామూహిక రుద్రయాగం, మృత్యుంజయ యాగం జరిపించారు. ఆలయ అర్చకులు ఘంటసాల పవన్ కుమార్ బ్రహ్మత్వంలో యాగ క్రతువును అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఆలయ అధికారులు వారి కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

## నేషనల్ సైబర్ క్రైమ్ కు పిర్యాదు చేసిన గౌతమ్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఇటీవల సోషల్ మీడియా వేదికగా వచ్చిన నకిలీ కథనాలపై వైసీపీ అభిమాని బడే గౌతమ్ నేషనల్ సైబర్ క్రైమ్లో ఫిర్యాదు చేసినట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తనను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను తీవ్రంగా ఖండిస్తూ ఇలాంటి కథనాలను సర్కులేట్ చేసే వారిపై చట్టపరమైన విచారణ జరిపి శిక్షించాలని కోరుతూ నేషనల్ సైబర్ క్రైమ్లో ఫిర్యాదు చేసినట్లు గౌతం తెలిపారు.

## నవ్వడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నవ్వడం నవ్వించడం ద్వారా ఒత్తిడిని జయించ వచ్చు అని విజయవాడ స్పార్క్ సైకాలజికల్ కౌన్సెలింగ్ సెంటర్ డైరెక్టర్, స్పార్క్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డా రమేష్ అన్నారు. నేషనల్ స్ట్రెస్ అవేర్నెస్ డే ను పురస్కరించుకొని స్థానిక ఎస్ వి ఎల్ క్రాంతి జూనియర్ కాలేజీలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ ఒత్తిడి వలన కలిగే ఇబ్బందులు, ఒత్తిడిని అధిగమించే మార్గాలతో పాటు చదువుకోవడం ద్వారా మంచి మార్కులు ఎలా సాధించు కోవాలో విద్యార్థులకు తెలియచేశారు.. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలి అంటే మానసికంగా ధృడంగా వుండాలి, క్రమం తప్పకుండా యోగా, మెడిటేషన్ చేయాలి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం



**అవనిగడ్డ. మేజర్ న్యూస్ :** గత కొన్ని రోజులుగా ఎమ్మెల్సీ ఓటు నమోదు శిబిరాలను నిర్వహించిన కూటమి నాయకులు చివరి రోజైన బుధవారం భారీగా ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు తెలిపారు. మార్చిలో జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండె కనకదుర్గ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బచ్చు కృష్ణకుమారి,కర్ర సుధాకర్, తోట శ్యాం కిషోర్,కూనపరెడ్డి చంద్రశేఖర్, తుంగల రంగాజీ, మేడికొండ విజయ్, తదితరులు పాల్గొన్నారు.



## పెండ్యాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**కంచికచర్ల నవంబర్ 6 మేజర్ న్యూస్ :** శాస్త్రీయ పద్ధతుల్లో పత్తి సాగు చేయటం ద్వారా రైతులు అధిక దిగుబడి పొందుతారు అని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. మండలంలోని పెండ్యాల గ్రామం లో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం జరిగింది ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రైతులకు పత్తి పంటపై అవగాహన కల్పించారు. స్వయంగా పత్తి చేయాలను పరిశీలించి రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో పత్తి పంటల సాగు చేసే విధానం వివరించారు. తద్వారా వ్యవసాయం లాభసాటి గా ఉంటుంది అని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎన్టీఆర్ జిల్లా ఏ డి ఏ పి ఆర్ సి మోనిష నందిగామ ఏడిఏ ఐ కే శ్రీనివాస్,కంచికచర్ల మండల వ్యవసాయ అధికారి కె.విజయ్ కుమార్, గ్రామీణ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో శ్రీ చైతన్య విజయ దుందుబి




**నందిగామ, మేజర్ న్యూస్ :** శ్రీ చైతన్య పాఠశాల సి బ్యాచ్ వి ద్యార్థులు క్యాట్ ఒలంపియాడ్ పరీక్షలలో విజయ దుందుభి మోగించారు క్యా ట్ లెవెల్ వన్ పరీక్షలలో 61 మంది శ్రీ చైతన్య విద్యార్థులు ఉత్తీర్ణత సాధిం చారు.ప్రిన్సిపాల్ రమేష్ పవారి ఆర్ఐ వినోద్ ఏజీఎం మురళీకృష్ణ విద్యార్థుల కు అభినందనలు తెలిపారు. సిబ్యాచ్ ఇంచార్జ్, డీన్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించిన శివరాం



**పామర్రు నవంబర్ 6 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గం పరిధిలోని తోట్లవల్లూరు మండలం పెనమకూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఈడే శ్రీనివాసరావు పెదకర్మ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరవనేని శివరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన శివరాం అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## పట్టణంలో ఆర్డీవో బాలకృష్ణ ఆకస్మిక తనిఖీలు



**నందిగామ, నవంబర్ 6, మేజర్ న్యూస్:** రెవిన్యూ డివిజనల్ అధికారి కె బాలకృష్ణ నందిగామ టౌన్లో గల రెండవ వార్డు సచివాలయమును పట్టణంలో గల అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా సచివాలయంలో గల సిబ్బందిని వారి యొక్క విధుల గురించి అడిగి తెలుసుకున్నారు, వివిధ రికార్డులను పరిశీలించారు. విధులలో



నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు వడ్డించే ఆహారంను పరిశీలించి ఉన్నారు, గర్భవతులకు బాలింతలకు ఇచ్చు పౌష్టిక ఆహారమును పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలియజేశారు.

## "మినుము సాగులో విత్తన శుద్ధి తప్పనిసరి"



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బందరు మండలం ఎస్ఎన్ గొల్లపాలెంలో మినుము సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం డి ఆర్ సి డి డి ఏ కే జ్యోతి రమణి సూచించారు మండలంలోని ఎస్ ఎన్ గొల్లపాలెం డి ఆర్ సి ఆధ్వర్యంలో రైతులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా మినుము విత్తే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. విత్తన శుద్ధికి ట్రైకోడెర్మా విరిడి 5 గ్రాములు ఒక కేజీ విత్తనానికి లేదా ఇమిడా క్లోపిరేడ్ 2 ఎమ్ ఎల్ ఒక కేజీ విత్తనానికి కలుపుకొని విత్తన శుద్ధి చేయాలని తెలిపారు. డి ఆర్ సీ,ఏ డి ఎ కే శ్రీనివాసరావు మాట్లాడుతూ వరిలో పొడ తెగులు రాకుండా హెక్సాకొనజోల్ 250 ఎం.ఎల్ ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. ఏ ఓ,బి పద్మజ వ్యవసాయ అధికారి డి.హారిక గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్రీనరీ పనులను వేగవంతం చేయండి

## కాటాను ఒక నెలలో అందుబాటులోకి తీసుకురండి : అధికారులను ఆదేశించిన కమిషనర్ ధ్యానచంద్ర





విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : బెంజ్ సర్కిల్ వద్దగల ఫ్లైఓవర్ కింద జరుగుతున్న సుందరీకరణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని విజయవాడ నగర పలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆటోనగర్, బెంజ్ సర్కిల్ తదితర ప్రాంతాలు పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే బెంజ్ సర్కిల్ ప్రాంతంలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు జరగాలని దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అన్నారు. ఆటోనగర్ గార్బేజి ట్రాన్స్ఫర్‌లో కాటాను ఒక నెలలోపు పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించిరు. ఆటోనగర్ లో ఉన్న గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ను పరిశుభ్రంగా ఉంచాలని, కాటాను ఒక నెలలో అందుబాటులోకి తీసుకురావాలని, పరిరక్షణ కొరకు రైలింగ్లు, గోడను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి. సత్యకుమారి, ఇతర శానిటరీ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



## శిక్షణా తరగతుల సమయాన్ని కుదించాలి

### పీహెచ్ సి వైద్యుల పర్యవేక్షణ ప్రతీ రోజు ఉండాలి

జి.కొండూరు మేజర్ న్యూస్ : రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణా తరగతుల సమయాన్ని కుదించాలని, శిక్షణ కేంద్రాలలో ఫస్ట్ ఎయిడ్ సిబ్బంది ఏర్పాటు చేయాలని డెమొక్రటిక్ పిఆర్టీయు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు డెమొక్రటిక్ పి ఆర్ టి యు ఇబ్రహీంపట్నం మండల శాఖ నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం లో ముఖ్య అతిథి గా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు డా. డి. శ్రీనుమాట్లాడుతూ రాష్ట్రం లో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు ఉదయం 8 గంటలకు నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించడం వల్ల 50 సంవత్సరాలు వయసు పైబడిన ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనవుతున్నారని... రెసిడెన్షియల్ ట్రైనింగ్ కావడం వల్ల ఎమర్జెన్సీ సమయంలో సహాయకంగా ఉండడానికి ఫస్ట్ ఎయిడ్ సిబ్బందిని నియమించాలని ప్రతిరోజు పి.హెచ్.సి డాక్టర్ల సందర్శన కూడా ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి నాగరాజు మండల శాఖ అధ్యక్ష రాలు బి ఆదిలక్ష్మి జిల్లా కార్యదర్శులు కె.వెంకటేశ్వర్లు వి లాల్ నాయకులు సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## నంద్రు శ్రీరామమూర్తి పై కేసు నమోదు చేయటంపై నిరసన



జగ్గయ్యపేట మేజర్ న్యూస్: పట్టణంలోని జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాగ సుందర్ రావు ఆధ్వర్యంలో నందిగామ బార్ అసోసియేషన్ సభ్యులు, సబ్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా విధులు నిర్వహిస్తున్న నంద్రు శ్రీరామమూర్తి పై నందిగామ పోలీసులు అక్రమంగా కేసు నమోదును ఖండిస్తూ న్యాయవాదులు విధులకు బహిష్కరించారు. ఈ సందర్భంగా అన్నెపాగ సుందర్ రావు మాట్లాడుతూ నందిగామ బార్ అసోసియేషన్ సభ్యులు నంద్రు శ్రీరామమూర్తి చేసిన తప్పులు ఏమిటని ప్రశ్నించారు. భారత రాజ్యాంగంలో ప్రతి పౌరుడికి వాక్కు స్వాతంత్రం హక్కు స్వేచ్ఛ స్వాతంత్రం, పత్రిక స్వాతంత్రం, వ్యక్తి స్వాతంత్రం హక్కు ఉందని, తన హక్కుని బహిర్గతం చేశారని, ఇది తప్పని పోలీసులు ఆయనపై పార్టీ రంగు పులిమి కేసు నమోదు చేయటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి దామాల సంతోష్, ట్రెజరర్ మెట్టేల వీరాంజనేయులు, సీనియర్ న్యాయవాదులు నరసరాజు, బసవరాజు, శ్రీనివాస గౌడ్, ధనుంజయుడు, న్యాయవాదులు పూల నాగరాజు, జే అశోక్ కుమార్, హనుమంతరావు, ఆర్ వి ప్రసాద్, మాతంగి నరేష్, కరిసే రత్నబాబు, అమ్ములు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## హోమ్ మంత్రి, అధికారులను పై పవన్ బహిరంగ సభల్లో వాఖ్యలు సరికాదు



నందిగామ, నవంబర్ 6, మేజర్ న్యూస్ : హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి వంగలపూడి అనిత ధైర్యంతో డైనమిక్ గా విధులు నిర్వహిస్తున్నారని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. నందిగామలో జరిగిన ఒక కార్యక్రమంలో సురేష్ బాబు మాట్లాడుతూ హోం మంత్రి అనిత ప్రభుత్వ టీచర్ గా పనిచేస్తూ రాజకీయాల్లోకి వచ్చి తన సమర్ధవంతమైన పనితీరుతో ప్రజాప్రతినిధిగా రాణిస్తూ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. అధికారం లేనప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా ప్రజా సమస్యలపై రాజీ పడకుండా అహర్నిశలు పోరాడిన మహిళ అనిత అని గుర్తు చేశారు.ఆమె సమర్ధత గుర్తించే ముఖ్యమంత్రి చంద్రబాబు బాబు నాయుడు అనిత కు హోమ్ మంత్రి పదవి ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో వరుసగా మహిళలు,బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆవేదనతో హోంమంత్రి, పోలీస్ అధికారులు నిందితుల పట్ల మరింత కఠినంగా వ్యవహరించాలని సూచించడంలో తప్పు లేదని తాను భావిస్తున్నట్లు సురేష్ బాబు తెలిపారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలలో రాద్ధాంతం అవసరం లేదని అన్నారు. హోమ్ మంత్రి నిశ్చలంగా పని చేయకుండా ఉంటే తాను హోం మంత్రి బాధ్యతలు తీసుకుంటా అంటూ పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేయకుండా ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు మహిళలను ఆవేదన గురి చేసేవిగా ఉండటమే కాకుండా హోం మంత్రి అనిత సరిగా పనిచేయడం లేదని అర్థం వచ్చేలా ఉన్నాయన్నారు. ఐపీఎస్ అధికారుల పనితీరు పై సైతం పబ్లిక్ మీటింగులలో తక్కువ చేసి వ్యాఖ్యలు చేయటం సరికాదని అన్నారు. సరిగా పనిచేయని అధికారులు హెచ్చరిస్తూ,అంతర్గత సమీక్షలో స్పష్టమైన ఆదేశాలు ఇవ్వొచ్చని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల పట్ల సానుకూల చర్చ జరిగితే బాగుంటుంది తప్ప వాటిపై అనవసరమైన రాద్ధాంతం అవసరం లేదని సురేష్ బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు మాదుగుల రామస్వామి తదితర నేతలు పాల్గొన్నారు.



## ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పార్కులలో కల్పించండి

### విజయవాడ నగర పలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణ కల్పించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. బుధవారం ఉదయం విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ గదిలో ఉద్యానవనాలపై పార్క్ సూపర్వైజర్లతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని, నిరంతరం పార్కులో ఉన్న హరితాన్ని పర్యవేక్షిస్తుండాలని, పరిశుభ్రతలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, పార్కుల్లో ఆట పరికరాలు ఏమైనా పాడైపోయినచో ఇంజనీరింగ్ సిబ్బందితో సమన్వయంతో పార్కులలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, ప్రజలు పార్కులలో గడిపే ఆ సమయాన్ని ఆనందకరంగా గడిపేటట్టు చూసుకోవాల్సిన బాధ్యత పార్క్ సూపర్వైజర్ దేనని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, పార్క్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## కాలుష్య రహిత నగరానికై యూనిసెఫ్ ప్రతినిధులతో సమావేశం



విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : కాలుష్య రహితం నగరంగా విజయవాడను మార్చేందుకు సహాయపడుతున్న యూనిసెఫ్ ప్రతినిధులతో విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర బుధవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల తమ ఛాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఎస్టీపీల లో జరుగుతున్న అభివృద్ధి పనులను చర్చించారు, వాడక నీటి శుద్ధతపై నగరపాలక సంస్థ తీసుకుంటున్న చర్యలు, యూనిసెఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పురోగతి తదితర అంశాలపై చర్చించి, నగరాన్ని మరింత కాలుష్యరహిత నగరాన్ని తీర్చిదిద్దటానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ ఎన్.పి సింగ్, కోఆర్డినేటర్ దీపిక పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి భక్తి గీతాలు సీడీ ఆవిష్కరణ



జగ్గయ్యపేట మేజర్ న్యూస్: ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిపై కైకలూరుకి చెందిన విద్యాంజలి విద్యాసంస్థల అధినేత, ప్రిన్సిపాల్, విద్యావేత్త, ఆంగ్ల ఉపన్యాసకులు సయ్యద్ జమీల్ అహ్మద్ స్వయంగా రచించి గానం చేసిన భక్తి గీతాల సీడీని బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాతయ్య భక్తి గీతాలను విని అమ్మవారి వైభవాన్ని, ప్రాశస్త్యాన్ని చక్కటి సాహిత్యంతో కళ్ళకు కట్టినట్లు పాటలను రక్తి కట్టించారని రచయిత అహ్మద్ ధన్యజీవి అని కొనియాడారు. ముస్లిం మతానికి చెంది కూడా అమ్మవారిపై భక్తితో ఆమె జీవిత చరిత్రను చదివి గేయాలను రాయటం ఎంతో ఆనందంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులు అహ్మద్ కు ఉంటాయని అభినందిస్తూ సత్కరించారు. ఈకార్యక్రమంలో గెల్లా వైకుంఠేశ్వర రావు, కాకరపర్తి రమేష్, పెనుగొండ రాజీవ్, పైడిమర్రి మాల్యాద్రి, జమీల్ అహ్మద్, వెంకటస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన మద్యం లక్ష్యంగా

## నూతన ప్రామాణికాల మేరకు పరీక్షలు

### ప్రాంతీయ ప్రోబెషనరీ, ఎక్సైజ్ లేబొరేటరీలలో అత్యాధునిక గ్యాస్ క్రోమోటోగ్రఫీ

### బ్లెండ్ పరీక్షకు 9, ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ పరీక్షించడానికి 13 పారామితులు

### మద్యం వినియోగదారుల ఆరోగ్య సంరక్షణకు ఉపకరించేలా ప్రభుత్వ చర్యలు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** నాణ్యమైన మద్యంను వినియోగదారులకు అందించాలన్న లక్ష్యం మేరకు ప్రభుత్వం నూతనంగా విభిన్న ప్రమాణికాలు మేరకు పరీక్షలు నిర్వహిస్తుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఇప్పటి వరకు కేవలం ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఇఎన్ఎ) నమూనాలను పరీక్షించి అరు రకాల ప్రమాణీకాలను మేరకు పరిశీలించేవారని ఇప్పుడు ఈ విధానాన్ని పూర్తిగా ఆధునీకరించామన్నారు. ప్రాంతీయ ఎక్సైజ్ లాబొరేటరీలలో ఆరు ప్రాథమిక ప్రమాణీకాలను మేరకు ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ నమూనాలను ఇథైల్ ఆల్కహాల్, అసిడిటీ, ఆల్డిహైడ్స్, మిథనాల్, నీటిలో కలయిక మాత్రమే నిర్వహించేవారన్నారు. మరో వైపు ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ రూపంలో ఉత్పత్తి అయ్యే విస్కీ, బ్రాందీ, వోడ్కా, జిన్, రమ్ లకు సంబంధించి బాటిలింగ్ చేయడానికి ముందు మిశ్రమ నమూనాలలో ఆల్కహాల్ శాతం (స్ట్రెంత్) మాత్రమే లెక్కిస్తున్నారు. ఇలా కేవలం ఒక పరామితి మాత్రమే ఇప్పటి వరకు పరీక్షించబడుతుండగా, ప్రభుత్వ అదేశాల మేరకు ఇప్పుడు ఈ విధానాలలో సమూల మార్పులు తీసుకువచ్చారు. ఆధునిక సాంకేతిక ఆలంబనగా ముందడుగు వేస్తున్నారు.

ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, బ్లెండ్ (బాటిలింగ్ కు ముందు సిద్ధం చేసిన నమూనా) లను పరీక్షించడానికి గ్యాస్ క్రోమోటోగ్రఫీని విదానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని కొల్లు రవీంద్ర వివరించారు. ఇది సాంకేతికంగా ఉన్నతమైన విధానంగా గుర్తింపు పొందింది. వైజాగ్, గుంటూరు, చిత్తూరు, కర్నూలు, కాకినాడలలోని రీజనల్ ప్రోబెషనరీ, ఎక్సైజ్ లేబొరేటరీల ద్వారా బాటిలింగ్ కు ముందు అన్ని రకాల మద్యంను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్), ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ఉండేలా వివిధ రకాల ఆల్కహాల్, మద్యం కోసం పరీక్షా పారామితులు విస్తరించామని రాష్ట్ర అబ్కారీ, మద్య నిషేద శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు. ఆధునీకరించబడిన పరీక్షలను అనుసరించి ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఇఎన్ఎ) పరీక్షించడానికి పదమూడు 13 పారామితులు సిద్ధం చేసారు. బ్లెండ్ (విస్కీ, బ్రాందీ, వోడ్కా జిన్) పరీక్షించడానికి తొమ్మిది పారామితులు నిర్ణయించారు. నూతన ప్రామాణీకాల అమలు ఫలితంగా కెమికల్ రియాక్షన్ వంటి పరిస్థితులను అడ్డుకోగలుగుతామ న్నారు. ఇది మద్యం వినియోగదారుల ఆరోగ్య సంరక్షణకు ఉపకరిస్తుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

### ప్రాంతీయ పత్రికలకు గుడ్ న్యూస్ ..

**విజయవాడ, మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వంలో జీఎస్టీ ఐటీ రిటర్స్ అంటూ ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రాంతీయ పత్రికల ఎడిటర్లకు సమాచార శాఖా మంత్రి శుభవార్త చెప్పారు. క్యాబినేట్ సమావేశం అనంతరం సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో మంత్రి పార్థ సారథి ఆంధ్రప్రదేశ్ పత్రికా సంపాదకుల సంఘం (ఏపీఎస్ఎస్) నేతలు ఆయన్ని కలిశారు. చిన్నపత్రికలకు ఎదురవుతున్న సమస్యలను మంత్రి పార్థ సారధి సమాచార శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకువెళ్లారు. గత ప్రభుత్వంలో అనేక కష్టాలు పడ్డామని కూటమి ప్రభుత్వంలోనైనా ప్రాంతీయ పత్రికలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి పార్థ సారధి ఇక నుంచి జీఎస్టీ, ఐటీ రిటర్న్ తో సంబంధం లేకుండానే అక్రిడిడేషన్లు, యాడ్స్ మంజూరు చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏ జిల్లాలో అయితే పర్యటిస్తారో ఆ జిల్లాలో ఎంప్యానల్‌మెంట్ పత్రికలతో పాటు రెగ్యులర్ గా వచ్చే పత్రికలకు కూడా యాడ్స్ ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎంప్యానల్‌మెంట్ ఉన్న పత్రికలకు వారి రేటు కార్డు ప్రకారం ఇస్తామని అలాగే రెగ్యులర్ గా వచ్చే వాటిని గుర్తించి ఇంత అని రేటు కేటాయించిన తర్వాత యాడ్స్ మంజూరు చేస్తామన్నారు.. గుర్తింపు పొందిన ఛార్టర్డ్ అకౌంట్ తో సీఏ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ప్రాంతీయ పత్రికలందరికీ కూటమి ప్రభుత్వంలో న్యాయం చేస్తామన్నారు. అందరి సమస్యలు వింటామని, అవసరమైతే అన్ని యూనియన్ల తో సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రాంతీయ పత్రికలను ఇబ్బంది పెట్టొద్దని రెగ్యులర్ గా వచ్చే వాటిని గుర్తించి యాడ్స్ ఇవ్వాలని తెలిపారు.ఎంతో కాలం నుంచి ప్రాంతీయ పత్రికల ఎడిటర్లు ఎదుర్కొంటున్న సమస్యకు మంత్రి పార్థసారథి పరిష్కారం చూపించారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పత్రిక సంపాదన సంఘం ఆధ్వర్యంలో మంత్రి పార్థ సారధికి ధన్యవాదాలు తెలియజేశారు...మంత్రిని కలిసిన వారిలో ఏపీఎంపిఎ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, సంపాదకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు (ఏపీఎస్ఎస్) కుర్మా ప్రసాద్ బాబు, ఏపీజేయూ ప్రధాన కార్యదర్శి కాకుమాను వెంకట వేణు, పోతుల వెంకట్, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## తమిరిస హై స్కూల్ లో విద్యార్థులకు అవగాహన సదస్సు





**నందివాడ,మేజర్ న్యూస్ :** మండల పరిధిలో తమరిశ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు పలు అంశాలపై రూరల్ సి.ఐ.సోమేశ్వర రావు, నందివాడ ఎస్.ఐ కె శ్రీనివాసరావు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సోమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు కలిగి ఉండాలని మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రుల పైన కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా ఆడపిల్లల పట్ల గౌరవంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఆడపిల్లలకు ప్రతి విషయం మీ తల్లిదండ్రులకి తెలియజేయాలన్నారు.మైనర్ వివాహాలు జరిపిన, జరిపించడానికి ప్రయత్నం చేసిన, సైబర్ క్రైమ్ గురించి, కాల్ 112 గురించి వివరించారు.ఆకతాయిలు అల్లరి మూకలు ఎవరినైనా



ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థి విద్యార్థులను ఆయన కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి



**చల్లపల్లి, నవంబరు 6, మేజర్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ వివిపిఎస్. ఆంజేయులు అన్నారు. లయన్స క్లబ్ రీజియన్ చైర్పర్సన్ యు.రాంబాబు ఆర్థిక సహకారంతో జాతీయ రహదారికి పక్కనే 50 పండ్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ గవర్నర్01 ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి నీరుపోశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, జిల్లా క్యాబినెట్ కోశాధికారి నర్రా సాయిబాబు, చల్లపల్లి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి ప్రసాద్, కోశాధికారి ముమ్మనేని నాని, ప్రముకులు కొల్లిపర మధు, ఎస్.ఎ.భాషా, వరదా హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులకు లయన్ క్లబ్ పెద్దలు నర్రా సాయిబాబు ఆర్థిక సహాయంతో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లా వైస్ గవర్నర్ వివిపిఎస్. ఆంజనేయులు, ఆర్సీ రాంబాబులు అతిథులుగా పాల్గొని పుస్తకాలను పంపిణీ చేశారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనకోసం అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్న మన కోసం మనం ట్రస్టు లయన్స్ క్లబ్ పెద్దలు ఎస్ జి ఏ. భాషా రూ. 10వేల విరాళాన్ని అందచేశారు. జిల్లా వైస్ గవర్నర్ ఆంజనేయులు చేతులమీదుగా స్వచ్ఛసారధి డాక్టర్ డిఆర్కె.ప్రసాద్కు అందచేశారు.

## వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

### నందిగామ రూరల్ సిఐ చహన్



**కంచికచర్ల నవంబర్ 6 మేజర్ న్యూస్ :** వాహనదారులు నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని నందిగామ రూరల్ సీఐ చవాన్ స్పష్టం చేశారు.ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక ప్రధాన రహదారి లో వాహనాలను సిఐ,ఎస్ఐ రాజుతో కలిసి తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు.వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి సంబంధించిన ఆర్సి,ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, తప్పనిసరిగా ఉండాలన్నారు. ముఖ్యంగా వాహనాలు నడిపే వాళ్లు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణించే వారికి అపరాధ రుసుము విధించారు. ప్రతి ఒక్కరు కూడా బాధ్యతగా వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడప రాదని, అతివేగంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆటో డ్రైవర్లు కూడా పరిమితంగా ప్రయాణికులను ఎక్కించుకోవాలని ఆటోలు,ట్రాక్టర్లు నడిపేటప్పుడు లౌడ్ స్పీకర్లు వాడరాదన్నారు. ప్రతి ఒక్కరు కూడా రహదారి భద్రత సూచనలు పాటించాలని కోరారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నగరంలో నాణ్యమైన మంచినీళ్లు సరఫరా





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నగరంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన మంచినీటిని సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం నగరంలోని హెడ్ వాటర్ వర్క్స్ ను తనిఖీ చేసి అక్కడ ఫిల్టర్ బెడ్లు క్లారిఫైయర్లు శుభ్రం చేస్తున్న బురద నీటిని శుభ్రం చేస్తున్న క్లారిఫైయర్లను పరిశీలించారు. రెండు హై స్పీడ్ సబ్మెర్సిబుల్ శివేజ్ పంపు లను విజయవాడ నుండి కొనుగోలు చేసి తెప్పించామని వాటి ద్వారా బురదను తొలగించే ఏర్పాట్లు చేశామని మున్సిపల్ కమిషనర్ బాపిరాజు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ సోమవారం నగరంలోని భాస్కరపురం రాజుపేట గొడుగుపేట హౌసింగ్ కాలనీ లలోని ప్రజలు నగరంలో సరఫరా చేస్తున్న మంచినీటి లో మంచినీరు ధర్మ దుర్వాసన వస్తుందని రంగు మారిపోయిందని ఫిర్యాదు చేశారన్నారు ఆ వెంటనే నీటి ట్రీట్మెంట్ ప్లాంటును ఆడిట్ చేయించామని క్లారిఫై లోకేటర్ లో బురద ఉన్నట్లు కనపడిందని దానిని మొత్తం బయటకు తీసే ఏర్పాట్లను చేస్తున్నామన్నారు వచ్చే మూడు నాలుగు రోజుల్లోగా ఆ పనులు పూర్తవుతాయన్నారు నగరంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన మంచినీటిని సహస్ర సరఫరా చేసేందుకు నగరపాలక సంస్థ జిల్లా యంత్రాంగం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. అంతకుమునుపు బైపాస్ రోడ్డు లో ఎస్ఎన్ గొల్లపల్లి- చల్లపల్లి మార్గంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రతిరోజు నగరం నుండి 84 టన్నుల చెత్తను సేకరించి రెండు కాంపాక్టర్ల ద్వారా 18 టన్నుల చెత్తను గుంటూరు జిల్లాలోని కొండవీడు లో ఉన్న జిందాల్ పవర్ ప్లాంట్ కు పంపించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జిల్లా కలెక్టర్కు వివరించారు. దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ అసలు రోజుకు అంత చెత్త వస్తుందా మరలా ఒకసారి రోజువారి ఎంత చెత్త వస్తుందో సరిగా పరిశీలించి వివరాలు అందజేయాలని సూచించారు.

ముఖ్యమంత్రి హామీ మేరకు చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దాల్సి ఉందని మొత్తం చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు మరమ్మతులు చేయక మూలనబడి ఉన్న ఇంకొక కాంపాక్టర్కు వెంటనే మరమ్మతులు చేయించి దాని ద్వారా మరో 9 టన్నుల చెత్తను గుంటూరు జిల్లాకు పంపించాలన్నారు. అదనంగా మరో కొత్త కాంపాక్టర్ ను కూడా కొనుగోలు చేసి దాని ద్వారా కూడా మరో 9 టన్నుల చెత్తను గుంటూరు జిల్లాకు పంపించి నగరంలో చెత్త లేకుండా చేయాలని జిల్లా కలెక్టర్ కమిషనర్ కు సూచించారు. కొత్తగా డంపింగ్ యార్డ్ కోసం కృష్ణ విశ్వవిద్యాలయంకు రెండు కిలోమీటర్ల దూరంలో కేటాయించిన 13.40 ఎకరాల స్థలాన్ని వినియోగంలోకి తేవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట మునిసిపల్ ఇంజనీరు చంద్రశేఖర్, డి ఈ కుబియా నాయక్, ఏఈ తేజశ్రీ, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పామాయిల్ పరిశ్రమ ఏర్పాటుకు బాటలు వేయాలి

**ఘంటసాల :** దివిసీమలో పామాయిల్ పరిశ్రమ ఏర్పడే స్థాయిలో ఆయిల్ పామ్ పంట విస్తరించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. బుధవారం ఘంటసాల మండలం పాపవినాశనం లంకలో పామాయిల్ సాగును ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. రైతు, మాజీ సర్పంచ్ మునిపల్లి బుజ్జి భూమిలో ఆయిల్ పామ్ మొక్కలు నాటి మోటార్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెరగాలని ఆర్థిక వేత్త, మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు ఆకాంక్షించారన్నారు. రైతులు మార్కెట్ అవసరాలకు అనుగుణమైన పంటలు వేయాలని, దేశంలో ఆయిల్ పామ్, ఔషధ పంటలు వేయాల్సిన ఆవశ్యకత గురించి తనతో చెప్పిన మాటలు గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గంలో ఏకైక పరిశ్రమ కేసీపీ షుగర్స్ మూతబడిన నేపథ్యంలో పామాయిల్ పరిశ్రమ అయినా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కనీసం ఐదు వేల ఎకరాలు ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం ఉంటే పరిశ్రమ ఏర్పాటుకు అవకాశం ఉంటుందన్నారు. వరదలను సైతం తట్టుకునే ఆయిల్ పామ్ పంట సాగు ప్రయోజనాలు రైతులు గుర్తించి సాగు పట్ల ఆసక్తి చూపాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ పంటను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత కృష్ణాజిల్లా కలెక్టర్ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక ప్రగతికి అనువైన పంటల పట్ల రైతులు ఆసక్తి చూపాలని సూచించారు. డీ. హెచ్.ఓ జే.జ్యోతి మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు మండలాలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నట్లు పరిశీలన బృందం నిర్ధారించినట్లు తెలిపారు. ఆయిల్ పామ్ పంట నలభై ఏళ్ల పాటు ఆదాయం ఇస్తుందన్నారు. దేశీయ ఆయిల్ ఉత్పత్తి రంగం స్వయం సమృద్ధి సాధించేందుకు దేశంలో నూనె ఉత్పత్తి వనరులు పెంచుకునేందుకు ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రైతులు, ప్రభుత్వం, ఉండవల్లి ఆగ్రోస్ ఒప్పందం ద్వారా ఈ పంట విస్తీర్ణం పెంచేందుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు వివరించారు. ఆయిల్ పామ్ మొక్కకు గాలి, వెలుతురు అందేందుకు ఇబ్బంది లేని ఎలాంటి అంతర్ పంటను అయినా రైతులు వేసుకోవచ్చని సూచించారు. పంట కలెక్షన్ సెంటరుకు చేర్చే వరకూ భద్రపరుచుకోవటానికి షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ ఇస్తామన్నారు. ఉండవల్లి ఆగ్రోస్ డీజీఎం కొల్లా హరికృష్ణ మాట్లాడుతూ ట్రిపాడ్ అగ్రిమెంట్ ప్రకారం రైతులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. వరదలను తట్టుకునే సామర్థ్యం ఆయిల్ పామ్ మొక్కలకే ఉంటుందన్నారు. తక్కువ నిర్వహణ వ్యయం, తక్కువ కూలీల ఖర్చుతో ఆయిల్ పామ్ సాగు చేసుకోవచ్చన్నారు. రెండు మూడు గ్రామాలకు ఒక కలెక్షన్ పాయింట్ ఏర్పాటు చేస్తామని, అక్కడి నుంచి తామే ఫ్యాక్టరీకి తరలిస్తామన్నారు. రైతులు ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం, తాము అందిస్తున్న ప్రోత్సాహం, సబ్సిడీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, తహసీల్దార్ బీ.విజయ ప్రసాద్, సర్పంచ్ కుంపటి అనిత, ఉద్యానవన శాఖ అధికారిణి జే.కీర్తిదేవి, ఎంపీటీసీలు కుంపటి నాగేంద్ర బాబు, తాడికొండ చిన్నా, వీఆర్ఓ శివప్రసాద్, వీఏఏ ఎం.లావణ్య, రైతు సంఘం నాయకులు వేమూరి రత్నగిరి, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, అట్లూరి వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

# పనులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షించాలి

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో రహదారుల మరమ్మత్తు, అభివృద్ధి పనులకు సంబంధించి నాణ్యత ప్రమాణాలతో మంచి నాణ్యతతో పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పల్లె పండుగ- ఎంజీఎన్ఆర్ఈజీఎస్-2024-25- సిమెంట్ రోడ్లు- నాణ్యత ప్రమాణాలు అవగాహన సదస్సు బుధవారం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గుంతలు లేని రహదారు లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం గ్రామాల్లో అన్ని రహదారులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం రహదారుల నాణ్యతకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. నాణ్యత గల పనులను ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. రహదారుల మరమ్మత్తులు, అభివృద్ధి పనులకు సంబంధించిన మెటీరియల్ నాణ్యతతో పాటు రహదారులు ఎక్కువ కాలం మన్నేలా నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. గుత్తేదారులు తీసుకువచ్చిన




మెటీరియల్ నాణ్యతగా ఉందా లేదా పర్యవేక్షించాలన్నారు. చేస్తున్న పనులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. తొలుత ఏపీ ఆర్ ఆర్ పి ప్రాజెక్టు అడ్వైజర్ కే. ప్రభాకర్ రెడ్డి వివిధ కేటగిరీల రహదారులు, సీసీ రహదారులు, మెటీరియల్ నాణ్యత, పనుల నాణ్యత ప్రమాణాలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్క్ షాప్ లో వివరించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ రమణారావు, డ్వామా పీడీ ఎన్.వి శివప్రసాద్, పిఆర్ ఈఈ సుధాకర్ గౌడ్, పంచాయతీరాజ్ డిఈలు, ఏఈలు, ఉపాధి హామీ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఆర్ & బీ కాంట్రాక్ట్ బిడ్ లకు అర్హత కాల పరిమితి పెంచుతూ నిర్ణయం.



**విజయవాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కాంట్రాక్టర్లు అందరికీ మేలు చేసే విధంగా 5 ఏళ్ల బ్లాక్ పీరియడ్ కాల పరిమితిని 10 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకోవడం జరిగింది.. గత 5 ఏళ్ల కాలంలో రాష్ట్రంలో కాంట్రాక్టర్లు పెద్దగా అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలా లేదు.. దీనికి ప్రధాన కారణం.. 3 ఏళ్ల పాటు కరోనా కారణంగా అభివృద్ధి పనులు జరగకపోవడం ఒకటైతే, మరోవైపు గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఊసే లేని పక్షంలో, ఆయా కాంట్రాక్టర్లకు పనులు చేసే అవకాశం రాలేదు.. ఒకవేళ అభివృద్ధి పనులు చేపట్టినా, బిల్లులు రాకపోవడం, లేదంటే అవి సకాలంలో పూర్తికాకపోవడం వంటి సమస్యలతో నేడు వారంతా ఆర్ & బీ కాంట్రాక్టర్లుగా బిడ్ వేసేందుకు అర్హత కోల్పోయే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీంతో నేడు రాష్ట్రంలోని మెజార్టీ కాంట్రాక్టర్లు ఆయా కాంట్రాక్ట్ పనులు చేపట్టడానికి తగిన అర్హత లేకుండా పోయింది. ముఖ్యంగా రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఆర్ & బీ శాఖలో జరగబోయే రోడ్ల అభివృద్ధి, మరమ్మతులు వంటి పనులు చేపట్టేందుకు, గతంలో 5 ఏళ్ల కాల పరిమితిలో ఆయా కాంట్రాక్టర్లు చేపట్టిన పనులు, టర్నోవర్ వంటివి ప్రాతిపదికగా తీసుకుంటే మెజార్టీ కాంట్రాక్టర్లు నేడు నష్టపోయే పరిస్థితి ఉంది.. ముఖ్యంగా 5 సంవత్సరాల కాల పరిమితిని అర్హత గా తీసుకోవడం వల్ల మెజార్టీ కాంట్రాక్టర్ లు, సామర్థ్యం ఉన్నా, అర్హత లేక ఆయా కాంట్రాక్ట్ పనులు చేపట్టే అవకాశం కోల్పోతారు.. ఈ నేపథ్యంలో చిన్న, మధ్య తరగతి కాంట్రాక్టర్ల నుంచి వచ్చిన వినతుల మేరకు ఆర్ & బీ శాఖ తరపున కాంట్రాక్టర్ల అందరి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బ్లాక్ పీరియడ్ ను 5 నుంచి 10 ఏళ్లకు పెంచాలనే సానుకూల నిర్ణయం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీసుకోవడం జరిగింది.. దీంతో రాష్ట్రంలోని మెజార్టీ కాంట్రాక్టర్లకు ఆర్ & బీ పనుల టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించేందుకు వీలుపడుతోంది..

## ఆంగ్లో -ఇండియన్స్ సమస్యల పరిష్కారానికి కృషి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఉన్న ఆంగ్లో ఇండియన్స్ కుటుంబాల సంక్షేమానికి, వారు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ పేషి లో ఆంగ్లో-ఇండియన్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి బృందం (ఏపీ, తెలంగాణతో సహా 7 రాష్ట్రాలతో కూడినది) మంత్రి ఫరూక్ ను కలిశారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డా.ఎ.రాయ్ రోజారియో, ప్రధాన కార్యదర్శి ఎన్.పాట్రిక్ దూలాండ్, సభ్యులు బార్బరా ఆన్ బెర్రీ, అమలా వాలెస్,నిక్సన్ డి'క్రూజ్, కొరెట్టా ఆలియాస్ కవిత,కోరిన్ న్యూబెగింగ్ లు మంత్రి ఫరూక్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కే హర్షవర్ధన్,ఏపీ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి డాక్టర్ ఏ.శేఖర్ ల దృష్టికి ఆంగ్లో ఇండియన్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలో దాదాపు లక్ష దాకా ఆంగ్లో ఇండియన్స్ జనాభా ఉందని, అయితే ఎటువంటి అభివృద్ధికి సంక్షేమానికి నోచుకోలేక పడుతు న్న ఇబ్బందులను ఫెడరేషన్ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.ఆంగ్లో ఇండియన్స్ కు చట్టసభల్లో ప్రాతినిధ్యానికి కేటాయింపులు, ఉన్నత విద్య అభ్యాసనం, ఉపాధి కోసం రిజర్వేషన్ అమలు,బ్యాంకుల నుంచి రుణాలు అందేలా సరళీకృతమైన విధానాలు తో పాటు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూగత ప్రభుత్వ హయాంలో ఆంగ్లో ఇండియన్స్ కు దక్కాల్సిన సంక్షేమ ఫలాలు, నామినేటెడ్ పదవుల కేటాయింపులో భాగంగా వివిధ సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించే చర్యలను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం జరిగిందని అన్నారు.ఆంగ్లో ఇండియన్స్ కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు, వారి అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలను సీఎం నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం ద్వారా చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఫెడరేషన్ ప్రతినిధుల బృందానికి మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు. అనంతరం సిక్కుల సంఘం ప్రతినిధులు కూడా మంత్రి ఫరూక్ ను కలిశారు. ఏపీలో సిక్కుల ఆర్థిక స్వావలంబన, సంక్షేమం కోసం ప్రత్యేకంగా సిక్కుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి అండగా నిలవాలని ప్రతినిధులు మంత్రిని కోరారు. సిక్కు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై కూడా సీఎం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు.

# దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** సూర్యారావు పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరా టవర్స్ లో నివసిస్తున్న ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి, దొంగతనాలు ఏవిధంగా జరుగుతాయి, నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, పోలీస్ కమీషనర్ ప్రవేశపెట్టిన ఇ-పహారా గురించి, డైయల్ 100, 112, 1930, ఎల్ హెచ్ ఎంఎస్ యాప్ వలన కలిగే ఉపయోగాలు గురించి, సైబర్ క్రైమ్ నేరాలు ఏ విధంగా జరుగుతాయి ఏ విధంగా వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సి.సి.ఎస్. ఇన్స్పెక్టర్ అబ్దుల్ సలాం, వారి సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ డి సి పి రాజారావు సమావేశంలోని ప్రజలతో మాట్లాడుతూ, ఊరు వెళ్ళే సమయంలో తప్పనిసరిగా లోకల్ పోలీస్ వారికి సమాచారం అందించాలని, ఎల్ హెచ్ ఎంఎస్ యాప్ ను ఉపయోగించుకోవాలని, దీని వలన ఎవరైనా దొంగ ఇంటిలోనికి వస్తే వెంటనే అలారం మొగడం తోపాటు సమీపంలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం చేరి దొంగలను పట్టుకోవచ్చు, దొంగతనం జరగకుండా చూడవచ్చని, మీ దగ్గర ఉన్న విలువైన వస్తువులను లాకర్స్ లలో పెట్టుకోవాలని, పోలీస్ కమీషనర్ ప్రత్యేకంగా ఈ పహారా యాప్ ద్వారా బీటు పోలీస్ వారికీ త్వరితగతిన సూచనలు అందించడానికి ఉపయోగపడుతుందని వివరించారు. అదేవిధంగా అపార్ట్మెంట్ల పరిసరాలను పరిశీలించి చుట్టూ లైటింగ్ పెంచుకోవాలని, సెక్యూరిటీ పరంగా సి.సి.కెమెరాలను, వాచ్ మెన్ లను ఏర్పాటు చేసుకోవాలని, సదరు వాచ్ మెన్లు అపార్ట్మెంట్ వద్దకు రాత్రి సమయంలోనే కాకుండా పగటి సమయంలో ఎవరు వచ్చిన వారిని ఎవరు ఎందుకు వచ్చారు అని ప్రశ్నించే విధంగా తగు సూచనలు ఇవ్వాలని ఈ విధంగా అప్రమత్తంగా ఉంటూ దొంగతనాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు.



# కాలువల్లో వ్యర్థాలు వేయకుండా చూసుకోండి





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** కాలువల్లో ఎటువంటి వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం బోటుపైన బందరు కాలువ పర్యటించి, కాలువలో ఉన్న వ్యర్థాలను పరిశీలించారు. కాలువల్లో ఎటువంటి వ్యర్థాలు వేయకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, కాలువల్ని పరిశుభ్రంగా చూసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ కాలువల్లో గుర్రపుడెక్కలు పెరగకుండా, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూసుకోవాలి అని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, అధికారులను ఆదేశించారు.

# ముమ్మరంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు



**ఓటర్ల నమోదు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించిన మైలవరం శాసనసభ్యులు కృష్ణప్రసాదు**

**ఎన్డీఏ మహాకూటమి అభ్యర్థి ఆలపాటి రాజా విజయమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపు**

**నేటితో ఓటర్ల నమోదుకు ముగియనున్న గడువు**

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఓటర్ల మోదు ప్రక్రియను మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పార్టీ పిలుపు మేరకు ఎప్పటికప్పుడు పార్టీ శ్రేణులకు సమాయత్తం చేస్తున్నారు.విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు కేంద్రంలో శాసనసభ్యులు కృష్ణప్రసాదు పాల్గొని ఓటు హక్కు దరఖాస్తులను బుధవారం స్వీకరించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూనేటితో ఓటర్ల నమోదు ప్రక్రియ గడువు ముగుస్తుందన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం అందరూ సత్వరమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవంబర్ 23న ఓటర్ల జాబితా ముసాయిదా ప్రకటన... డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారన్నారు. డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు నిర్వహిస్తారని అన్నారు.ఓటు నమోదు చేసుకునే పట్టభద్రులు 2021 నవంబరు 1 లోపు డిగ్రీ/ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఎన్నికలకు తప్పనిసరిగా నూతనంగా ఓటు నమోదుకోవాలన్నారు. పాత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు చెల్లదన్నారు. ఫారం 18 సమర్పించాలని సూచించారు. తగు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి తాజాగా ఓటు హక్కు పొందాలన్నారు. ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ లలో ఎలాగైనా ఓటుహక్కు పొందవచ్చన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల అభ్యర్థిగా ఎన్డీఏ మహాకూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా) పోటీ చేస్తున్నారని, అందరూ ఆయన ఘన విజయానికి కృషి చేయాలన్నారు. ఎన్డీఏ మహాకూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## టీటీడీ ఛైర్మన్ బీఆర్‌కే నాయుడుకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుభాకాంక్షలు

**నందిగామ, నవంబర్ 6, మేజర్ న్యూస్ :** టీటీడీ నూతన పాలకమండలి కొత్త అధ్యక్షుడు బీఆర్ నాయుడు, 17 మంది సభ్యులు శ్రీవారి ఆలయం లోని రంగనాయకుల మండపంలో వారు బాధ్యతలు స్వీకరించారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ కూడా బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య టీటీడీ ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. నూతన బోర్డులో టీడీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు సభ్యులుగా నియమితులయ్యారు. జ్యోతుల నెహ్రూ(జగ్గంపేట), వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి(కోవూరు) ఎంఎస్ రాజు(మడకశిర) స్థానం దక్కించుకున్నారు. నూతన బోర్డులో సభ్యులుగా నియమితులైన ఎం.ఎస్. రాజు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు.అనంతరం తంగిరాల సౌమ్య వారి కుటుంబ సభ్యులతో శ్రీవారిని దర్శించుకున్నారు. తర్వాత రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అధికారులు వారికి పట్టు వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు జాతి ఐక్యతకు ఎమ్మెల్యే మండలి కృషి అభినందనీయం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** తెలుగు జాతి ఐక్యతకు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కృషి అభినందనీయమని వైసీపీ అభిమాని బడే గౌతం అన్నారు. తమిళ నాడు బీజేపీ నాయకురాలు కస్తూరి మన తెలుగు వారిని అవమాన పరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, కస్తూరి వ్యాఖ్యలను ఖండిస్తూ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ తెలుగు జాతి గొప్పతనాన్ని చారిత్రక ఆధారాలతో విశ్లేషణ చేసిన విధానం అద్భుతంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగమైన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర, కేంద్ర నాయకత్వాలపై వత్తిడి తెచ్చి కస్తూరితో తెలుగు వారికి వెంటనే క్షమాపణ చెప్పించి, తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని కాపాడే బాధ్యతను బుద్ధ ప్రసాద్ తీసుకుంటారని భావిస్తూ ఈ విషయం లో ప్రతి తెలుగు వాడు బుద్ధ ప్రసాద్ కు మద్దతుగా నిలవాలని గౌతం కోరారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి. కొండూరు లోని స్థానిక కమ్యూనిటీ హాల్లో స్కిల్ సెన్సెస్ సర్వే చేయు నిమిత్తం ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జి. కొండూరు మండల పరిషత్ అధ్యక్షురాలు వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వి.రామకృష్ణ నాయక్, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి రవితేజ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999